


రేపు క్షయ నివారణ దినోత్సవం

పార్వతీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో సర్వే చేసి క్షయ లక్షణాలున్న వారిని గుర్తించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈనెల 24న క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు , జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు, క్షయ నియంత్రణ అధికారి వినోద్‌కుమార్ తదితరులున్నారు.

- నూతన హైవే మీదుగా రవాణా
- ఒడిశా రాష్ట్రం నుంచి దిగుమతి
- పాచిపెంట, సాలూరు మీదుగా విశాఖకు తరలింపు
- ప్రత్యేక నిఘాతో దూకుడు పెంచిన జిల్లా పోలీసులు
- మూడు నెలల్లో భారీగా కేసుల నమోదు
- చెక్‌పోస్టులు పెంచితేనే మరింత కట్టడి


గోగాడవలస జంక్షన్ వద్ద గ్రీన్ ఫీల్డ్ రహదారి

ఇదే గంజాయి మార్గం

పార్వతీపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి):

గంజాయి రవాణాదారులకు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ రహదారి రాజమార్గంగా మారింది. పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టును తప్పిం చుకుని.. విశాఖ-రాయ్‌పూర్ నూతన హైవే మీదుగా ఒడిశాకు వారు గంజాయి రవాణా చేస్తున్నారు. అదే మార్గంలో తిరుగు ప్రయాణమై.. సాలూరు మీదుగా విశాఖ వరకు అక్రమ రవాణా చేస్తున్నారు. నూతన హైవేలో పెద్దగా తనిఖీలు లేకపోవడంతో గంజాయి రవాణాదారులు ఇష్టారాజ్యంగా తమ దందా కొనసాగిస్తున్నారు.

పోలీసుల ప్రత్యేక నిఘా..

గత వైసీపీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో గంజాయి రవాణా కొందరికి ప్రధాన ప్రధాన వృత్తిగా మారింది. దీంతో పోలీసుల కళ్లుగప్పి యథేచ్ఛగా రవాణా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. సర్కారు ఆదేశాలతో పోలీసులు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రత్యేక నిఘా పెట్టి రవాణాదారుల ఆటకట్టిస్తున్నారు. జిల్లాలో ఇటీవల నమోదైన కేసులే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

నమోదైన కేసులు..

- గంజాయి రవాణాకు సంబంధించి 2023లో 14 కేసులు నమోదు చేశారు. 205 కేజీలను స్వాధీనం చేసుకొని 28 మందిని అరెస్టు చేశారు. ఐదు వాహనాలను సీజ్ చేశారు.
- 2024లో 39 కేసులు నమోదు చేసి 736 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి పది వాహనాలను సీజ్ చేశారు.
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఐదు కేసులు నమోదు చేసి 1115 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పాచిపెంట మండలంలో స్వాధీనం చేసుకున్న గంజాయి ఎక్కువగా ఉంది. జనవరిలో పాచిపెంటలో 670 కేజీలు, పాచిపెంట-సాలూరు మండలాల్లో ఫిబ్రవరి నెలలో 157 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెలలో 288 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. కేవలం మూడు నెలల్లోనే 1115 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్న పరిస్థితి ఉందంటే పోలీసులు ఏ విధంగా నిఘా పెంచారో స్పష్టంగా కనిపిస్తుంది.

చెక్‌పోస్టులు పెంచితే...

గంజాయి రవాణా కట్టడికి జిల్లాలో చెక్ పోస్టులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం జిల్లాలోని పాచిపెంట మండలంలోని పి.కోనవలస, కొమరాడ మండలం కూనేరు, భామిని మండలం బత్తిలి, గుమ్మలక్ష్మీపురంలో చెక్‌పోస్టులు ఉన్నాయి. వాటికి అదనంగా పార్వతీపురం మండలం ఆర్‌కే బట్టివలస వద్ద, సాలూరు నుంచి ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు వెళ్లే మార్గంలో, విశాఖ-రాయ్‌పూర్ నూతన రహదారి ప్రాంతంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా చోట్ల పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాల్సి ఉంది. అత్యధికంగా గంజాయి రవాణా దారులు పాచిపెంట రహదారి గుండానే అక్రమ రవాణా సాగిస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో నిఘా మరింత పెంచాల్సి ఉంది.

కట్టడికి చర్యలు..



గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రత్యేక నిఘా పెట్టాం. చెక్‌పోస్టులు, పెట్రోలింగ్ ద్వారా ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నాం.

-మాధవరెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా


పట్టుబడిన గంజాయితో పోలీసులు

రెండు కార్లు.. 134 ప్యాకెట్లు

● 258 కేజీల గంజాయి పట్టివేత ● పరారీలో రవాణాదారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

పాచిపెంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండల పరిధి గ్రీన్‌ఫీల్డ్ రహదారి గోగాడవలస జంక్షన్ వద్ద శనివారం 258 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దాని విలువ రూ.25.85 లక్షలు ఉంటుందని వారు అంచనా వేశారు. కాగా తొలుత ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా రెండు కార్లు ఉన్నట్లు ఇన్‌చార్జి వీఆర్‌వో డి.రవి రాజు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటసురేష్, సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే రవాణాదారులు పరారయ్యారు. రెండు కార్లలో 134 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వాహనాలనూ సీజ్ చేశారు. రెండు కార్లలో కొన్ని పేపర్లు దొరికాయని, వాటి ఆధారంగా రవాణాదారులను పట్టుకుంటామని సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ తెలిపారు. ఒడిశా ప్రాంతం మల్కన్‌గిరి, పాడువ గ్రామాల నుంచి ఆంధ్రాకు గంజాయిని దిగుమతి చేస్తున్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగు కేసుల్లో 1100 కేజీల గంజాయి పట్టుబడిందని వీటి విలువ రూ. 1.40 కోట్లు వరకు ఉంటుందని వెల్లడించారు. ఐదు ఫోర్ వీలర్ వాహనాలను సీజ్ చేశామని, 12 మంది ముద్దాయిలను అరెస్టు చేశామని చెప్పారు. ఆంధ్రా - ఒడిశా సరిహద్దు వద్ద చెక్‌పోస్టు ఉన్నప్పటికీ గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై, కొఠియా వైపు కూడా నిఘా పెట్టామని తెలిపారు.


పాలకొండలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జిల్లా కార్యాలయం

మూడేళ్లయినా.. అక్కడే!

- పాలకొండలోనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం
- జిల్లాకేంద్రానికి తరలించని వైనం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



పార్వతీపురం, మార్చి22(ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు సాధారణంగా జిల్లా కేంద్రంలోనే ఉంటాయి. అయితే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. నేటికీ అది జిల్లా కేంద్రానికి దూరంగానే ఉంది. ప్రస్తుతం పాలకొండలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉంది. అక్కడ నుంచే జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ నిర్వహణ జరుగుతుంది. దీంతో జిల్లావాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఏర్పడి మూడేళ్లవుతున్నా.. ఇంకా ఆ కార్యాలయాన్ని పార్వతీపురానికి తరలించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఎవరైనా పార్వతీపురం, సాలూరు నుంచి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వెళ్లాలంటే ఇరువైపులా సుమారు 120 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది. దూరాభారం కావడంతో జిల్లావాసులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా కేంద్రం పార్వతీపురంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని పాలకొండలో నిర్వహిస్తున్నాం. అందుబాటులో ఉంటూ పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాం.

- ఆశా షేక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా...


ఎగువశెంబి భూముల్లో కంచె పనులు చేస్తున్న కూలీలు

కంచె వేసేశారు!

- ఒడిశా పోలీసుల భద్రతతో ఎగువశెంబిలో నిర్మాణం పూర్తి
- గిరిజనులు అడ్డుకున్నా ఫలితం లేని వైనం
- తహసీల్దార్‌కు ఫిర్యాదు

సాలూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూప్ ఎగువశెంబి కత్తులకొండ వద్ద నిర్దేశిత పొలాల్లో ఒడిశావాసులు శనివారం కంచె నిర్మాణం పూర్తి చేశారు. మైనింగ్ తవ్వకాల కోసం ఇదంతా చేస్తున్నారనే ఎగువశెంబి గిరిజనులు అభ్యంతరాలను బేఖాతరు చేస్తు ఒడిశా పోలీసుల భద్రతతో ఆ పనులు పూర్తి చేశారు. కంచె ఏర్పాటుకు కొఠియా పరిసర గ్రామాల నుంచి కూలీలను రప్పించారు. తొలుత ఈ పనులను ఎగువశెంబి గిరిజనులు అడ్డుకున్నారు. అయితే ఒడిశా పోలీసులు ఇక్కడకి రావొద్దంటూ వారిని పంపించేశారు. ఈ సాగు భూములు తమవే అంటూ ఏపీ మంజూరు చేసిన ఆర్వోఎఫ్ఆర్ భూ పట్టాలు చూపినా ఆ రాష్ట్ర పోలీసులు పట్టించుకోలేదు. ఈ భూములు తమవే అంటూ ఒడిశావాసులు వాదించారు. ఇదే సమయంలో గిరిజనులు పోలీసులను ఫొటోలు తీయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


సాలూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎగువశెంబి గిరిజనులు

అనంతరం వారు సాలూరు తహసీల్దార్ ఎన్వీ రమణకు ఫిర్యాదు చేశారు. తమ భూములకు రక్షణ కల్పించాలని కోరారు. ఒడిశా దౌర్జన్యంపై స్పందించాలని సీపీఎం నేత ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

భూగర్భ జలాలను పెంపొందించాలి

● నీటిని వృథా చేయరాదు ● ఫాంపాండ్స్ నిర్మాణాలకు చొరవ చూపాలి ● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొంకడివరంలో ఫాంపాండ్స్ పనులను ప్రారంభించారు. నీటి నిల్వలను పెంచేందుకు అవసరమైన ఫాంపాండ్స్ నిర్మాణాలకు 'ఉపాధి'లో మొదటి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే పనులకు ఉపాధి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఆయిల్‌పామ్‌పై దృష్టి

జిల్లాలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కొంకడి వరంలో ఉపాధి హామీ పథకంలో సాగు చేస్తున్న పామాయిల్‌ను పరిశీలించారు. వరిపైనే కాకుండా ఉద్యాన పంటలు, పామాయిల్, జీడి మొక్కల పెంపకంతో అధిక లాభాలు పొందొచ్చన్నారు. పాడి రైతులకు సహాయ సహకారాలు అందిస్తామని, గోకులాలకు సంబంధించి షెడ్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. లాభసాటి పంటలపై ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహ కాలు అందిస్తుందన్నారు. అనంతరం ఉపాధి నిధులతో నిర్మించిన గోకులాల షెడ్లను ఆయన పరిశీలించారు.

కలెక్టర్ దృష్టికి వేతనదారుల సమస్యలు

ఉపాధి పనుల నిర్వహణకు కొంతమేర సడలింపు ఇవ్వాలని కొంకడివరం గ్రామానికి చెందిన వేతనదారులు కలెక్టర్‌ను కోరారు. ఎండల నేపథ్యంలో రెండు పూటలా పనులు నిర్వహించ లేకపోతున్నామని తెలిపారు. ఉదయం పూట నిర్వహిస్తే కొంతమేర సౌకర్యంగా ఉంటుందన్నారు. సిబ్బంది ముందస్తుగా అందించిన కొలతల మేరకు పనులు నిర్వహిస్తే రెండో పూట హాజరు కానక్కర్లేదని కలెక్టర్ తెలిపారు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా చూడాలని, పనుల ప్రాంతంలో నీడతో పాటు తాగునీరు, అత్యవసర వైద్య సౌకర్యం కల్పించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపీడీవో జి.పైడితల్లిని ఆదేశించారు. రెండు నెలలకు పైగా వేతనాలు అందలేదని కూలీలు తెలపగా.. ఈ నెలాఖరులోగా చెల్లింపులు జరుగుతాయని భరోసా ఇచ్చారు. కొంకడివరం ప్రధాన రహదారి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.


కొంకడివరంలో ఫాంపాండ్స్ పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్

గోపీనాథుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

బురదాలమ్మ పండగకు సిరిమాను సిద్ధం

6లో

నేడు 'మిస్టర్ ఆంధ్రా' పోటీలు

● బరిలో మొత్తం 200 మంది

మీలో ఓ అగ్నివీరుడు

- నియామక ప్రక్రియ ప్రారంభం
- నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 10లోగా దరఖాస్తుకు అవకాశం
- జూన్‌లో ఆన్‌లైన్ రాత పరీక్ష
- తొలిసారిగా తెలుగు భాషలో..
- నిరుద్యోగ యువతలో ఆనందం



6లో

తిరిగొచ్చాయ్

● వసప నుంచి ఘనసరకి చేరిన ఏనుగులు



భామిని, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం వసపలో కొద్ది రోజులుగా సంచరించిన ఏనుగులు శుక్రవారం రాత్రి తిరిగి భామిని మండలం ఘనసరకు చేరుకున్నాయి. కీసరలో నీటి ఇంజన్, స్వీట్‌కార్న్, నీలగిరి మొక్కలను ధ్వంసం చేసిన గజరాజులు శనివారం సాయంత్రం ఘనసర ప్రాంతంలో హల్‌చల్ చేశాయి. దీంతో స్థానికులు, రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గత 20 రోజులుగా పొలం పనులు చేసుకుంటూ ప్రశాంతంగా ఉన్న తమకు మళ్లీ గజరాజుల బెడద పట్టుకుందని వారు వాపోతున్నారు. మరికొద్ది రోజుల్లో చేతికందనున్న మొక్కజొన్నను అవి నాశనం చేస్తాయేమోనని రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం ఘనసర, కీసర, కోసలి, తాళాడ వాసులు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఫారెస్ట్ అధికారులు రైతులు, గ్రామస్థులను అప్రమత్తం చేస్తున్నారు. బీట్ అధికారులు కేర్ ట్రాకర్స్ ఏనుగుల సంచారంపై దృష్టిసారించారు. పంట నష్టపోయిన రైతులు పరిహారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

పార్లమెంట్ భవన్‌లో అరకు కాఫీ

● మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ భవన్‌లో ఈ నెల 24న అరకు కాఫీ స్టాల్ ప్రారంభమవుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కోసం తాను ఢిల్లీ వెళ్తున్నట్టు చెప్పారు. అరకు కాఫీకి ఈ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 139 అంగన్‌వాడీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.20.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. పీఎం జన్‌మన్ కింద జిల్లాకు 11 కేంద్రాలు మంజూరయ్యాయని వెల్లడించారు. వాటికి సంబంధించి 11 పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న మరో 53 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్టు చెప్పారు. కొండ శిఖర గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నామన్నారు. డోలీలు మోతలు తప్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా గిరి బజార్ ద్వారా గిరిజనులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. కంటైనర్ ఆసుపత్రిని కూడా ప్రారంభించామని చెప్పారు.

మీలో ఓ అగ్నివీరుడు

- నియామక ప్రక్రియ ప్రారంభం ● నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 10లోగా దరఖాస్తుకు అవకాశం
- జూన్‌లో ఆన్‌లైన్ రాత పరీక్ష
- తొలిసారిగా తెలుగు భాషలో..
- నిరుద్యోగ యువతలో ఆనందం



విజయనగరం/బొబ్బిలి రూరల్/ భోగాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగులకు మరో సువర్ణావకాశం. ఆర్మీలో నియామకానికి సంబంధించి అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థులు ఏప్రిల్ 10లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్‌లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తారు. విశాఖ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలో ఆరు ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు విశాఖలోనే ఫిజికల్ ఫిట్‌నెస్, ఈవెంట్స్ పరీక్షలు జరగనున్నాయి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్, టెక్నికల్, ట్రేడ్స్‌మెన్‌ను భర్తీ చేయనున్నారు. ఈసారి ఎంపిక ప్రక్రియలో మార్పులు చేశారు. ఆన్‌లైన్ పరీక్షను ప్రాంతీయ భాషల్లో పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. అంటే తెలుగులో పరీక్ష రాసుకోవచ్చన్న మాట.

● వేతనాలు ఇలా..

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైతే తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు వేతనంగా అందిస్తారు. నాలుగేళ్లకు సేవానిధి ప్యాకేజీని అందిస్తారు. వార్షిక సెలవులు 30 వరకూ ఉంటాయి.



ఆరోగ్య సమస్యలను బట్టి సిక్ లీవ్ ఇస్తారు. నాలుగేళ్ల పాటు సర్వీసులో ఉన్నప్పుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్స్‌లు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తారు. నాలుగేళ్ల సేవకు గాను వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అందిస్తారు. ఇంటర్ సమాన స్థాయి సర్టిఫికెట్ అందిస్తారు. వీరికి పింఛన్, గ్రాట్యూటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గా గుర్తించరు. కరువు భత్యం, మిలటరీ సర్వీస్ పే వీరికి వర్తించదు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు.

నాలుగేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్న అగ్నివీర్ బ్యాచ్ నుంచి 25 శాతం మందిని ఆర్మీలో రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్లలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైన వారు 15 ఏళ్ల పాటు ఆర్మీ సర్వీసులో కొనసాగవచ్చు.





సేవానిధికి ఇలా జమ..

సేవానిధిలో భాగంగా ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. మొదటి నెల పొందే రూ.30 వేల వేతనంలో రూ.9 వేలను కార్పస్ ఫండ్‌కు బదలాయిస్తారు. అగ్నివీర్‌కు కేవలం రూ.21 వేలు మాత్రమే అందుతుంది. రెండో ఏడాది వచ్చేసరికి రూ.23,100 వేతనం రూపంలో అందుతుంది. రూ.9,900 నిధికి జమ అవుతుంది. మూడో ఏడా దికి రూ.25,500 వేతనంగా అందుతుంది. రూ.10,950 నిధికి వెళుతుంది. నాలుగో ఏడాదికి వచ్చేసరికి వేతనంగా రూ.28 వేలు, నిధికి రూ.12 వేలు వెళతాయి. ఇలా నాలుగేళ్లలో అగ్నివీర్ సేవా నిధికి రూ.5.02 లక్షలు పోగవు తుంది. ఇంతే మొత్తం ప్రభుత్వం జమచేస్తుంది. ఈ లెక్కన ఈ నాలుగేళ్లలో రూ.10.04 లక్షలు అందుతాయన్న మాట. దీనికి వడ్డీ మొత్తం కలిపి అందిస్తారు. అగ్నివీర్‌లకు బ్యాంకు రుణం అందే సదుపాయం కల్పిస్తారు.

వేర్వేరుగా ప్రశ్నపత్రాలు..

దరఖాస్తు చేసుకున్న పోస్టును బట్టి ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో ఎక్కువ విభాగాలకు జనరల్ నాలెడ్జ్, జనరల్ సైన్స్, మ్యాథ్స్, లాజికల్ రీజనింగ్‌లో ప్రశ్నలు ఉంటాయి. కొన్ని పోస్టులకు కంప్యూటర్ సైన్స్, జనరల్ ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీల్లోనూ ప్రశ్నలు ఉంటాయి. సాధార ణంగా 50 ప్రశ్నలు ఉంటాయి. వీటిని గంటలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కొన్ని పోస్టులకు మాత్రం 100 వరకూ ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో గత పరీక్షల ప్రశ్నపత్రాలు ఉంటాయి. వాటిని చూసి సాధన చేస్తే చాలా మంచిది. క్లర్క్, స్టోర్ కీపర్, టెక్నికల్ పోస్టులకు మాత్రం టైపింగ్ కీలకం. నిమిషానికి 30 ఆంగ్ల పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.

మార్కులు ఎలాగంటే...

అన్నిపోస్టులకు ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. అందులో భాగంగా 1.6 కిలోమీటర్లు 5 నిమిషాల 30 సెకెన్లలో పూర్తి చేస్తే 60 మార్కు లు, 5 నిమిషాల 31 సెకెన్ల నుంచి 45 సెకన్ల లోపు పూర్తి చేస్తే 48 మార్కులు ఇస్తారు. కనీసం ఆరు ఫుల్ అప్స్ తీయాలి. 6 తీసిన వారికి 16 మార్కులు, 7 తీస్తే 21, ఎనిమిది ఫుల్‌అప్స్ తీస్తే 27, తొమ్మదికి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. 9 అడుగుల పాటు లాంగ్ జంప్ వేస్తే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ పరీక్షలు ఉంటాయి. వీటిన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపిక చేస్తారు.

దేశం కోసం..



నా తల్లిదండ్రులు దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. దేశ సేవ చెయ్యాలన్నది చిన్నప్పటి నుంచి నా కోరిక. అగ్నివీర్ కోసం శిక్షణ తీసుకున్నాను. త్వరలో జరగబోయే అగ్నివీర్ సెలెక్షన్స్‌లో పాల్గొని ఎంపికవుతాననే నమ్మకం ఉంది. సైన్యంలో చేరి.. దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తాను.

-బూర హరిప్రసాద్, గంగాడ, బొబ్బిలి మండలం

ఆర్మీలో చేరాలనేది ఆశయం..



మాది బొబ్బిలి ప్రాంతం. ఈ ప్రాంతమంటేనే పోరాటాలకు పేరు. అలాంటి గడ్డపై పుట్టిన నాకు ఆర్మీలో చేరాలనే కోరిక బలంగా ఉంది. గతంలో చాలా ఎంపికలకు వెళ్లాను. కానీ నిరాశే మిగిలింది. దీంతో గత 6 నెలల నుంచి శిక్షణ తీసుకుంటున్నాను. ఎలాగైనా దేశ సేవలో పాల్గొనాలనే కృత నిశ్చయంతో శిక్షణ పొందుతున్నాను. దీని కోసం విశ్రాంత సైనికుల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటున్నాను. ఈసారి తప్పనిసరిగా ఎంపికవుతాననే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతున్నాను.

-జీరా శ్రావణ్ కుమార్

అదో అదృష్టం..



అగ్నివీర్‌కు ఎంపికై... దేశమాతకు సేవ చేసే అవకాశం దొరికితే అదృష్టంగా భావిస్తా. అందుకే జీతం గురించి కాకుండా దేశం కోసం ఆలోచించి అగ్నివీర్‌లో చేరేందుకు శిక్షణ పొందుతున్నాను. మా కుటుంబ సభ్యులు, మిత్రుల ప్రోత్సాహం ఉంది. త్వరలో జరిగే అగ్నివీర్ సెలక్షన్స్‌లో తప్పకుండా ఎంపికవుతాననే నమ్మకం ఉంది.

-కాకి ప్రశాంత్ కుమార్, గుడివాడ, భోగాపురం మండలం

సీసీ రోడ్లకు భారీగా నిధులు

- కాలువల నిర్మాణంపైనా దృష్టి
- రూ.400 కోట్ల విలువైన పనులు మంజూరు
- పనస చెట్లను విరివిగా పెంచాలి
- కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఉపాధి హామీ కన్వర్జెన్స్ కింద రూ.400 కోట్ల విలువైన పనులు మంజూరు చేసినట్టు కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. ఇప్పటి వరకూ సుమారు రూ.150 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని... ప్రగతిలో ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని చెప్పారు. మిగిలిన రూ.250 కోట్ల పనులను ఏప్రిల్, మే నెలల్లో పూర్తి చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫామ్ పాండ్స్ తవ్వడానికి శనివారం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. వీటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జూన్ నాటికి సుమారు 11,522 ఫామ్ పాండ్స్ నిర్మాణం లక్ష్యం కాగా... ఈనెలాఖరు లోగా 3,200 పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ వేతనదారులకు కనీస వేతనం రూ.300 వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. ఉపాధిలో అవినీతి, అక్రమాలను సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎక్కడ లోటుపాట్లు జరిగినా ఎంపీడీవోలదే బాధ్యత అని పేర్కొన్నారు. ఎంపీడీవోలు విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీ..

త్వరలో జిల్లా అధికారుల నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించి, క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేయిస్తామని... అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. బొబ్బిలి వీణల తయారీకి ఉపయోగించే పనస కలప కొరత ఉందని, దీనిని నివారించేందుకు విస్తృతంగా పనస చెట్లను పెంచాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అక్షరాస్యత పరీక్షను పర్యవేక్షించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షకు సుమారు 48,578 మంది హాజరు కానున్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి..

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి నిరుద్యోగ యువత ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. దీనికి సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పది... ఆపై తరగతులు ఉత్తీర్ణత అయిన వారంతా ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాది పాటు ఉండే ఈ శిక్షణ కాలంలో నెలకు రూ.6000 చొప్పున స్టయిపండ్‌ను అందజేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, సీపీవో బాలాజీ, మెప్మా పీడీ చిట్టిరాజు, జిల్లా నైపుణ్య అధికారి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ..

ఈ నెల 24న ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా శనివారం తన చాంబర్‌లో దీనికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ అంబేడ్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జీవనరాణి, టీబీ అధికారి రాణి పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ స్థలంపై కన్ను

- దక్కించుకునేందుకు కొందరి ప్రయత్నాలు
- జోరుగా పైరవీలు



పోలీసు గృహ సముదాయాన్ని కూలదోస్తున్న దృశ్యం (ఫైల్)

రాజాం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజాం నగర నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువ చేసే పోలీసు క్వార్టర్స్ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మూడేళ్ల క్రితం కూలగొట్టిన భవన సముదాయంలో క్వార్టర్స్ నిర్మాణ పనులు చేపట్టకుండా వదలి పెట్టడంపై పోలీసు యంత్రాంగంతో పాటు ఈ ప్రాంత ప్రజల్లోనూ సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విలువైన ఈ స్థలం చేతులు మారుతోందన్న గుసగుసలూ వినిపిస్తున్నాయి. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1996లో నిర్మించిన ఎస్.ఐ. క్వార్టర్‌తో పాటు సిబ్బంది కోసం నిర్మాణం చేపట్టిన రెండంతస్తుల భవన సముదాయాన్ని అప్పటి హోం మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రారంభించారు. రెండు దశాబ్దాల అనంతరం భవన సముదాయం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది క్వార్టర్లను ఖాళీ చేశారు. కొందరు సొంతంగా గృహాలు నిర్మించుకుంటే... మరి కొందరు తమకు అనుకూలమైన అద్దె ఇళ్లలో చేరారు. ఇదిలా ఉంటే ఈ స్థలాన్ని దక్కించుకునేందుకు ఒకరిద్దరు పారిశ్రామికవేత్తలు, కొందరు రాజకీయ నేతలు తమదైన శైలిలో ప్రయత్నాలు ప్రారంభించారు. దీనికోసం గట్టిగానే పావులు కదుపుతున్నారు.

● మూడేళ్ల క్రితం..

మూడేళ్ల క్రితం ఉన్నఫళంగా భవన సముదా యాల కొట్టివేత ప్రారంభించారు. కానీ అదే ప్రదేశంలో భవన సముదాయ నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పోలీసులతో పాటు స్థానికుల్లో సైతం అనుమానాలు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉంటే కొట్టివేతలు ప్రారంభించిన ఏడాది తరువాత రాజాం పట్టణానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో పోలీసు క్వార్టర్స్ నిర్మాణానికి ఉమ్మడి శ్రీకాకుళం ఎస్పీ స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీతో పాటు స్థలాన్ని రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. అయితే కనీస సౌకర్యాలు లేని ఈ ప్రాంతంలో క్వార్టర్స్ నిర్మాణాన్ని పోలీసు యంత్రాంగం వ్యతిరేకించారు. పాత స్థలంలోనే నూతన భవన సముదాయం నిర్మించాలన్న డిమాండ్ పోలీసు వర్గాల నుంచి తెరపైకి వచ్చింది. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వం కొట్టడాలే తప్ప కట్టడాలు చేపట్టకపోవడంతో తదుపరి చర్యలు ముందుకు సాగలేదు.

● అద్దె ఇళ్లలోనే...

రాజాం టౌన్, రూరల్ స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు పోలీసు సిబ్బంది అద్దె ఇళ్లలో నివశిస్తున్నారు. ఒకే ప్రాంతంలో సమష్టిగా కష్టసుఖాల్లో కలిసిమెలిసి ఉండాల్సిన పోలీసు వర్గాలు అందుకు విరుద్ధంగా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత భవన సముదాయ ప్రాంతంలోనే క్వార్టర్స్ నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ పోలీసు వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని వారంతా కోరుతున్నారు.

గోపీనాథుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



దీపారాధన చేస్తున్న మహిళలు

భామిని, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లివిరిలో గోపీనాథ రాధాకృష్ణ డోలోత్సవాలకు శనివారం భక్తులు పోటెత్తారు. మన రాష్ట్రంతో పాటు ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. గోపీనాథ స్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే మందిర ముఖద్వారం వద్ద క్యూ కట్టారు. పర్లాకిమిడి, గుణుపూర్, కాశీనగర్, బొత్తవ, బుదర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బురదాలమ్మ పండగకు సిరిమాను సిద్ధం

సాలూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం దత్తివలస బురదాలమ్మ గ్రామదేవత ఉత్సవాలకు సిరిమానును శనివారం యువత ఆనందోత్సవాల మధ్య గ్రామంలోకి తీసుకొచ్చారు. దత్తివలస బురదాలమ్మ పండగ ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పండగలో భాగంగా ఈ నెల 25న సిరిమానోత్సవం జరగనుంది. సిరిమాను చెట్టును మామిడిపల్లి సమీపంలో కొట్టి.. తీసుకొచ్చారు. ఈ పండగ నిర్వహణకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



బురదాలమ్మ పండగ కోసం సిరిమానును తీసుకొస్తున్న స్థానికులు

గంజాయి రవాణాపై కఠిన చర్యలు

విజయనగరం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఐజీ గోపీనాథ్ జెట్టీ అధికారులను ఆదేశించారు. శనివారం రేంజ్ పరిధిలోని ఎస్పీలు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సమావేశంలో గంజాయి అక్రమ రవాణా వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలు, నిందితులు అరెస్టు, ఆస్థుల జప్తు, డి ఆడిక్షన్ కార్యక్రమాలపై చర్చించారు. గంజాయి అక్రమ రవాణాలో వ్యక్తుల ఆస్తులను గుర్తించి త్వరితగతిన జప్తు చేయాలని ఆదేశించారు. విని యోగదారులను గుర్తించి కౌన్సిలింగ్ చేపట్టే విధంగా కార్యచరణ రూపొందించాలన్నారు. ఎస్పీలు వకుల్ జిందాల్, తుహిన్ సిన్హా, అమిత్ బర్దర్, మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీలతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

నేడు 'మిస్టర్ ఆంధ్రా' పోటీలు

- బరిలో మొత్తం 200 మంది

పార్వతీపురం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం 31వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. ఆదివారం జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల ఎగ్జిబిషన్ గ్రౌండ్ బాడీ బిల్డింగ్ పోటీలకు వేదిక కానుంది. అర్నాల్డ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రెప్టన్ జిమ్ సహకారంతో పోటీలను నిర్వహిస్తు న్నారు. మన్యం జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించడం ఇది రెండోసారి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 11 విభాగాల్లో 200 మంది బాడీ బిల్డర్స్ పోటీ పడనున్నట్లు నిర్వాహకులు హరిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ పోటీలకు సంబంధించి 16 మంది న్యాయ నిర్ణేతలను నియమించామని తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోటీదారులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను జిల్లా కేంద్ర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.



బాడీ బిల్డింగ్ పోటీలకు సిద్ధమవుతున్న వేదిక

మే నెల నుంచి కొత్త పింఛన్లు

- మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు ● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి

గంట్యాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వితంతువులకు మే నెల నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 93 వేల మంది అర్హులు ఉన్నట్లు గుర్తించామన్నారు. శనివారం గంట్యాడ గ్రామానికి వచ్చిన ఆయన వివిధ వర్గాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త పింఛన్ల కోసం 5 లక్షలు మంది అర్హులు ఉన్నట్టు అంచనా వేశామన్నారు. ప్రస్తుతం అనర్హుల పింఛన్లు తొలగించడానికి దివ్యాంగుల వివరాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో చాలా మంది అనర్హులకు ఇచ్చారని.. అటువంటి వాటిని తనిఖీ చేస్తామన్నారు.

యువతకు ఉపాధిపై దృష్టి..

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు మంత్రి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గం, మండల స్థాయిలో దీనికోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. ప్రతి మండలానికి ఐదుగురు ఉద్యోగులు, ఒక పట్టభద్రుడితో కలిసి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడం కోసం వివిధ రంగాలలో శిక్షణ ఇస్తామన్నారు. గతంలో మహిళా సంఘాల అభివృద్ధికి రూ.540 కోట్లు కేటాయించారని, ఈసారి దీనిని రూ. వెయ్యి కోట్లకు పెంచామని ఆయన తెలిపారు. మరుపల్లి, కొండకిండాంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులతో కస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు అల్లు విజయ కుమార్, రంధి చినరాముడు, గోపాలరాజు, మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గొట్లాం రైతు సేవా కేంద్రంలో గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగ మండలాలకు చెందిన రైతులకు రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా జేడీ వీటీ రామారావు, ఏడీఏ కె.మహరాజన్, నాయకులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, చప్పా చంద్రశేఖర్, నాయకులు గోపాలరాజు, నంబూరి రాజేష్, అల్లు విజయ్‌కుమార్, ముంజేటి పార్వతి పాల్గొన్నారు.

●దత్తిరాజేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడసాం గ్రామానికి చెందిన వోల్లు నారాయణప్పడుకు రూ.15వేలు, ఇంగిలాపల్లికి చెందిన అరిశెట్టి రామచంద్రరావుకు రూ.2, 91 200, పెదమానాపురానికి చెందిన బల్లిరెడ్డి ఉమామహేశ్వరరావుకు రూ.40వేలు, చౌదంతివలసకు చెందిన కె.జగదీశ్‌కు రూ.23,400 సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, నాయకులు మజ్జి మహేష్, తాడ్డి రవి పాల్గొన్నారు.


రైతుకు రాయితీ యంత్ర పరికరాల ధ్రువపత్రాన్ని అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం

● ఇంకుడు గుంతల తవ్వకాలు ప్రారంభం

భూగర్భ జలాలు పెంపే లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఇంకుడు గుంతల తవ్వకాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు.

●విజయనగరం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 240 ఇంకుడు గుంతలు తవ్వడం లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. మండలంలోని రీమాపేటలో ఇంకుడుగుంతల తవ్వకం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు పాల్గొన్నారు. అలాగే ద్వారపూడిలో ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని పారంభించారు.

●చీపురుపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. శనివారం కర్లాంలో ఫాంపాండ్ల తవ్వకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దన్నాన రామచంద్రుడు, మహంతి అప్పలనాయుడు, కెల్ల రామారావు, బాణాన రామకృష్ణంనాయుడు, దుగ్గ మల్లేశ్వరరావు, గంట్యాడ సత్యనారాయణ, గడే సన్యాసప్పలనాయుడు, ఎంపీడీవో ఐ. సురేష్, ఏపీఓ ఆదిబాబు పాల్గొన్నారు.

●లక్కవరపుకోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీటి నిల్వలు పెంచి తద్వారా బావితరాలకు మంచినీరు అందించాలని ఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు. ఎల్.కోట బంగారు బుల్లోడు వ్యవసాయ భూముల్లో ఫాంపాండ్ల పనులకు శ్రీకారం చుట్టారు.


లక్కవరపుకోట: ఫాంపాండ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి


చీపురుపల్లి: పనులను ప్రారంభిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు


విజయనగరం రూరల్:మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

నేడు ఉల్లాస్ పరీక్ష

గరివిడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గరివిడిలో 50 సెంటర్లకు సంబంధించిన ఉల్లాస్ పరీక్ష మెటీరియల్ ఏపీవో నారాయణరావు శనివారం వీవోలకు పంపిణీ చేశారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువు నేర్చుకున్న మహిళలకు గ్రామాల్లోని ఎంపీపీ, ఎంపీయూపీ స్కూళ్లలో ఆదివారం ఉదయం పది గంటలకు ఈ పరీక్ష జరగనుందని తెలిపారు.

●మెరకముడిదాం మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాంలో ఆదివారం నిర్వహించే ఉల్లాస్ పరీక్ష నిర్వహణపై ఏపీఎం ధనలక్ష్మి ఆధ్వర్యంలో పలుశాఖల సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ గురించి వివరించారు.

రేపు భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ

కొత్తవలస, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెల్లి రెవెన్యూలో ఏర్పాటు చేయనున్న గ్రేహౌండ్స్ శిక్షణా దళ కేంద్ర కోసం భూసేకరణపై మరోసారి సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి. నీలకంఠారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఆర్డీవో,ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హాజరవుతారని పేర్కొ న్నారు.

రేపు క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో జీవనరాణి, క్షయనియంత్రణ అధికారి కె.రాణిలు తెలిపారు. విజయనగరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ క్షయలేని జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

27న ఉప సర్పంచ్ ఎన్నిక

మెరకముడిదాం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామయావలస ఉప సర్పంచ్ ఎన్నిక ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఎన్నికనిర్వహణ అధికారి సుధాకర్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ రెడ్డి శాంతమ్మకు నోటిఫికేషన్ కాపీ అందజేశారు.పాఠశాల గోడకు నోటీసు ప్రతిని అతికించారు.

బోరు ఏర్పాటుపై ఫిర్యాదు

గరివిడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కోనూరు శ్మశానవాటిక సమీపంలో బోరు ఏర్పాటుపై సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు వెంపడాపు రమణమూర్తి ఎంపీడీవోకు ఫిర్యాదుచేశారు. శ్మశానవాటికలో ఇప్పటికే బోరు ఉందని, మరో పది మీటర్ల దూరంలో సర్పంచ్ బూడి శ్రీరాములు ప్రభుత్వ నిధులతో మరో బోరు ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని రమణమూర్తితోపాటు కొందరు గ్రామస్థులు సంతకాలతో కూడుకున్న వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

పారదర్శకంగా పనిచేయాలి

వేపాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ఎంపీటీసీలు,సర్పంచ్‌లు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పంచాయతీల తీర్మానం మేరకు మంజూరు చేయాల్సిన గోకుల షెడ్డులను అధికార పార్టీవారికి మాత్రమే మంజూరు చేయడం ఎంతవరకు సమంజమని నిలదీశారు. బానాది ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసి ఎంపీపీ నిధులు మంజూరులో వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు, ప్రత్యేకాధికారి లక్ష్మీనారా యణ, తహసీల్దార్ రాములమ్మ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

రాజాం మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. ఈ మేరకు కోండ్రు మురళీమోహన్ రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌ను శనివారం కలిశారు. ఆయన వెంట టీడీపీ నాయకడు కొళ్ల అప్పలనాయుడు ఉన్నారు.


లోకేష్‌తో మాట్లాడుతున్న నాయకులు

డయేరియా బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

గుర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలకు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి శనివారం చెక్కులు పంపిణీ చేశారు. ఇటీవల గుర్లలో డయేరియా సోకి చనిపోవడంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటించి మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థికసాయం ప్రకటించిన విషయం విదితమే. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రాజేష్‌వర్మ, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివశంకర్, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ పాల్గొన్నారు. కాగా డయేరియా మృతుల పేరుమీద చెక్కులు రాగా ఒక్కసారిగా ఆయా కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. దీంతో పంపిణీని ఆపేసి, కొత్త చెక్కులను రాసి మళ్లీ ఇచ్చారు.

సమయపాలన పాటించాలి

గజపతినగరం, మార్చి22:(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకోవాలని పీడీ షేక్ సుల్తాన్‌బేగం పీవోను ఆదేశించారు. శనివారం గజపతినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న పోషన్‌బి- పడాయి బి శిక్షణ తరగతులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందజేయాలని కోరారు. అనంతరం పురిటిపెంట, గజపతినగరం అంగన్‌వాడీకేంద్రాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో పీవో నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్లతోనే వ్యాధుల నిర్మూలన

బొండపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సకాలంలో వ్యాక్సిన్లు వినియోగించుకుని వ్యాధులను నిర్మూలించేలా సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యాధికారి జీవనరాణి పిలుపునిచ్చారు.శనివారం గొట్లాం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో చేపడుతున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియోతోపాటు కోరింత దగ్గు, పచ్చకామెర్లు తదితర ఐదు రకాల వ్యాధులు, 10-16 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతాలను అరికట్టేందుకు టీకాలను బుధ, శనివారాల్లో వేయనున్నట్లు తెలిపారు. అనంతరం టీకా నమోదు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, చంద్రశేఖరరాజు, హెచ్‌వీ రాధాకుమారి, ఎంఎల్‌హెచ్‌సీ వసంతలక్ష్మి పాల్గొన్నారు.

మిల్లు నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మిల్లును నిర్వహించి ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టడానికి స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చర్యలు తీసుకోవాలని జ్యూట్ మిల్‌వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. శనివారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన చర్చల్లో జ్యూట్ యాజమాన్యం మిల్లు తిప్పడానికి అంగీకరించి మెంటినెన్స్ పనులు ప్రారంభించి నెలరోజులు గుడుస్తున్నా ఉత్పత్తి ప్రారంభించలేదని తెలిపారు. మిల్లు మూతబడి పది నెలలు కావస్తుండడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్మికులు కే.పద్మనాభం, ఎస్.సూర్యారావు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో పీ-4 వార్డు సభలు

నెల్లిమర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీలోని అగురువీధి, ఇందిరా కాలనీ, పద్మశాలి వీధి, 3,4,5సచివాలయల పరిధిలో శనివారం పీ-4 వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో పీ-4 సర్వే ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు,సీఎండీ గోవిం దరావు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో నగరాభివృద్ధికి కృషి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సమష్టి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామని మేయర్ వీవీ లక్ష్మి తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 26 అంశాలు, 14 అనుబంధ అంశాలను పొందుపరిచారు. సాధారణ సమావేశంలోని అజెండా అంశాల్లో రెండు మినహా, మిగిలిన అన్నింటికి సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్, కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ అప్పలరాజుతో పాటు కార్పొరేటర్లు, ఫ్లోర్ లీడర్, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే చర్యలు

కొత్తవలస, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీ చేయడంతోపాటు విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తవలస ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖర నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని రామలింగపురంలో సారా తయారీ, అమ్మకాలపై అవగాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వీఎన్ రాజు, సిబ్బంది ప్రసాద్, వీర్రాజు, ఆదినారాయణ, హరికిరణ్, గ్రామ సర్పంచ్ నెక్కల గౌరునాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగంగుబూడి రోడ్డులో రైతుల నిరసన

వేపాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం పొలాల్లో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను చెక్‌పోస్టు సిబ్బంది, మైన్స్ ఆర్ఐ శీరిష అడ్డుకున్నారు. దీంతో రైతులు,ట్రాక్టర్ల యజమానులు కొండగంగుబూడి రహదారిలో టాక్టర్లు, యంత్రాలతో నిరసన తెలిపారు. రైతులు పొలాల్లో నుంచి మట్టి తరలిస్తుంటే ట్రాక్టర్లు, యంత్రాలనుఅడ్డుకోవడం దారుణమని బొద్దాం గ్రామానికి చెందిన రైతులు, ట్రాక్టర్ల యజమానులు వాపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లా డుతూ ఇక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి రైతులు,సామాన్య ప్రజల నెత్తిన భారం మోపడం అన్యాయమన్నారు.చెక్‌పోస్టు యాజమాన్యం ఫిర్యాదు మేరకు సంటన స్థలానికి చేరుకున్న వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి ట్రాక్టర్ యజమానులు, రైతులతో మాట్లాడారు. అనంతరం చెక్‌పోస్టు యాజమాన్య ప్రతినిధులు, మైన్స్ అధికారులతో మాట్లాడారు.

నిజాయితీతో సేవ చేయాలి

●కస్టమ్స్ అడిషనల్ డెరెక్టర్ రవికిరణ్

విజయనగరం క్రైం,మార్చి 22(ఆంధ్రజ్యోతి):నిజాయితీతో ప్రజలకు సేవ చేయాలని కస్టమ్స్ అడిషనల్ డైరక్టర్ రవికిరణ్ పిలుపునిచ్చారు. శనివారం విజయనగరంలోని పీటీసీలో స్టైఫెండరీ క్యాడేట్ ట్రైనీ కానిస్టేబుల్ తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణ పురస్కరించుకుని పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో భాగంగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ, రాగ ద్వేశాలతో సంబంధం లేకుండా పోలీసులు ప్రజలకు సేవ చేయాలన్నారు. పీటీసీ ప్రిన్సిపాల్ రామచంద్రరాజు మాట్లాడుతూ శిక్షణకాలంలో నేర్చుకున్న కార్యక్రమాలను విధి నిర్వహణలో అవలంబించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ టీవీ అప్పారావు, డీఎస్పీలు శ్రీకాంత్, రమేష్, మెడికల్ అధికారి ఉదయ్‌కుమార్, ఎటి భవానీతో పాటు ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

భూసమస్యల డ్రైవ్‌కు 96 దరఖాస్తులు

మెంటాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మెంటాడ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన భూసమస్యల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి 96 దరఖాస్తులు అందాయి. తొలుత 121 మంది దరఖాస్తులు సమర్పించేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రజా ప్రతినిధులు, రైతులు తమ సమస్యలను తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించిన తహశీల్దార్, మిగిలిన వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరగా రైతులు సమస్యలు పరిష్కారం చేయడం కోసం అహర్నిశలు పనిచేస్తామని తెలిపారు.

'ఆపరేషన్ అమానత్'తో ఆభరణాల సంచి గుర్తింపు

●గంటల వ్యవధిలోనే స్వాధీనం ●పోగొట్టుకున్న ప్రయాణికుడికి అప్పగింత

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైల్ మదత్ (ఆన్‌లైన్ వ్యవస్థ) ఫిర్యాదుపై మర్రిపాలెం పోస్టు ఆర్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమై 'ఆపరేషన్ అమానత్' (సత్వరం స్పందించే విభాగం) చర్యలు చేపట్టడంతో బాధితుడు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలతో కూడిన సంచిని గంటల వ్యవధిలోనే చేజిక్కుంచుకున్నారు. ఆర్పీఎఫ్ తెలిపిన సమాచారం మేరకు... విజయనగరం జిల్లా బడేవలస గ్రామానికి చెందిన బి.రాంబాబు (28) అనే ప్రయాణికుడు ఈ నెల 20న సింహాచలం నుంచి బొబ్బిలి వెళ్లేందుకు బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలును అందుకునే తొందరపాటులో సుమారు రూ.2.83 లక్షల విలువైన 33 గ్రాముల బంగారు ఆభరణాలతో కూడిన సంచిని స్టేషన్‌లో మరిచిపోయాడు. మార్గంమధ్యలో ఆభరణాల సంచి మరచిన సంగతిని గుర్తించి వెంటనే రైల్ మదత్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వాల్తేరు రైల్వే ప్రధాన ఆర్పీఎఫ్ కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు అందుకున్న సిబ్బంది వెంటనే సింహాచలం ఆర్పీఎఫ్ పోస్టుకు సమాచారమిచ్చారు. విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జె.డిల్లి హుటాహుటిన స్టేషన్‌లో గాలించి ఆభరణాలతో కూడిన సంచిని గుర్తించి స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు బాధితునికి సమాచారమిచ్చారు. మర్రిపాలెం పోస్టుకు వచ్చిన బాధితుడిని పూర్తి స్థాయిలో విచారించారు. సంచిలో ఉన్న నెక్లెస్, చెవిపోగులు, చైన్ తదితర 33 గ్రాముల బంగారు ఆభరణాలు బాధితుడివేనని తగిన ఆధారాలతో నిర్ధారించుకున్న తర్వాత నిబంధనల ప్రకారం వాటిని అప్పగించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి, నిజాయతీ చూపడమే కాకుండా ఫిర్యాదుపై క్షణాల్లో ప్రతిస్పందించిన సింహాచలం పోస్టు సిబ్బంది పనితీరుపై సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, ఇతర అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

రంజన్ మిశ్రా నివేదికకు చట్టబద్ధత లేదు

విజయనగరం దాసన్నపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఈ నెల 20న ఎస్సీ వర్గీకరణపై ప్రవేశపెట్టిన రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికకు చట్టబద్ధత లేదని అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధి బొంగా భానుమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం విజయనగరంలో డీఆర్వో శ్రీనివాసమూర్తిని కలిశారు. ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికపై ఫిర్యాదును గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు వెంకటేష్, మాల్లాన సత్యనారాయ, సోము మురళీమోహన్ పాల్గొన్నారు.

పాముకాటుతో గిరిజనుడు మృతి

జియ్యమ్మవలస, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన ఓ గిరిజనుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అలమండ పంచాయతీ పరిధిలోని రావాడ రామభద్రపురం ఆ గ్రామానికి చెందిన గిరిజనుడు బిడ్డిక వెంకటి (52) కూలి పనికి వెళ్లి శుక్రవారం సాయంత్రం ఇంటికి చేరుకుని సేదతీరుతున్నాడు. ఆ సమయంలో ఆయన కుడిచేయి చిటికెన వేలిపై నాగుపాము కాటు వేసింది. వెంటనే తేరుకుని కాటు వేసి ఇంట్లో సామాన్లలో దూరిన నాగుపామును వెతికి మరి చంపి స్పృహ తప్పిపోయాడు. వెంటనే చుట్టు పక్కల వారు ఆయన్ను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సచేసి పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం రాత్రి మార్గమధ్యలో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు ఐదో తరగతి చదువుతున్న కుమార్తె అర్చన ఉంది. ఈయన మృతితో రావాడ రామభద్రపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

92 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్.కోట, విజయనగరం రైల్వేస్టేషన్ల పరిధిలో శనివారం ఫ్లాట్‌ఫారాపై 92 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టరు రవికుమార్ తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు..ఢిల్లీకి చెందిన ఎండీ అక్బర్, ఈస్మాయిల్, ముఖేష్, సానియాలు అక్రమంగా అరకు నుంచి రైలులో విశాఖ మీదుగా ఢిల్లీకి రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్.కోటలో తనిఖీలు చేపట్టారు. వారి వద్ద నుంచి 3 లక్షల 5 వేల విలువ గల 61 కిలోల గంజాయి పట్టుబడింది. విజయనగరం రైల్వేస్టేషన్‌లో మహారాష్ట్రలోని ముంబాయి భరత్‌నగర్‌కు చెందిన జాఫర్ యూసుఫ్ ఖురేషీ, హైదరాబాదులోని అమీర్‌పేట సంజీవ్‌రెడ్డి నగర్‌కు చెందిన అన్నూకుమారిలు తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి లక్షా 55 వేలు, విలువల గలిగిన 31 కిలోల గంజాయి తనిఖీల్లో పట్టుబడింది. ఈమేరకు అరెస్టు చేశారు. ఈ కేసును చాకచక్యంగా చేధించిన జీఆర్పీ ఎస్ఐ బాలాజీ రావు, హెచ్‌సీలు ఈశ్వరరరావు, పీసీలు హాసిన్, కె.ఈశ్వరరావు, ఎ.రామకృష్ణ, పి.స్వర్ణలత, పి.చైతన్యలను సీఐ రవికుమార్ అభినందించారు.

జాగరంలో మహిళపై దాడి కేసు దర్యాప్తు

జామి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరంలో ఓ మహిళపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జాగరంలో స్త్రీనిధి రుణాలకు సంబంధించి స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు శుక్రవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ వీవోఏ కొండమ్మ కొందరు తనను తలపై కొట్టి గాయపరిచారని పేర్కొని విజయనగరం మహారాజ ఆసుపత్రిలో చేరింది. తనపై వెలుగు అధికారుల ప్రోద్బలంతో దాడి జరిగిందని పేర్కొని కొందరు అధికారులు, సిబ్బంది పేర్లు తన ఫిర్యాదులో రాసింది. దీంతో కేసు నమోదుచేసి శనివారం జామి ఎస్ఐ వీరజనార్దన్ దర్యాప్తు ప్రారంభించారు.

భూదేవిపేటలో ఒకరి ఆత్మహత్యాయత్నం

గజపతినగరం,మార్చి22(ఆంధ్రజ్యోతి):మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన జగ్గునేని పాపయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాపయ్య ఇంటిలో ఎవరులేని సమయంలో గడ్డి మందు తాగాడు. కూలిపనులు చేసుకొని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి చుట్టుపక్క లవారి సహకారంతో 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పాపయ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

గజపతినగరం,మార్చి22 (ఆంధ్రజ్యోతి):ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు పట్టుబడడంతో 20 వేలు అపరాద రుసం విధించినట్లు తహసీల్దార్ బి. రత్నకుమార్ శనివారం తెలిపారు. ఎం.గుమడాం రెవెన్యూ పరిధిలోగల ఏడోంపులగెడ్డ నుంచి కొత్తశ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన బూడి జగ్గన్న ఎటువంటి అనుమతిలేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. సమాచారం మేరకు రెవెన్యూఅధికారులు దాడులు నిర్వహించగా ఎం.లింగాలవలస వద్ద ట్రాక్టర్ పట్టుబడినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండడంతో అపరాదరుసం విధించినట్లు తెలిపారు.

బోడసింగిపేటలోని దుకాణంలో చోరీ

బొండపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసింగిపేటలోని గిట్టుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో శనివారం వేకువజామున ఓ దుకాణంలో చోరీ జరిగింది. ఆ షాపులో కొంత నగదుతోపాటు విలువైన కిరాణా సామగ్రి అపహరణకు గురయ్యాయి. కనిమెరక గ్రామానికి చెందిన జి.శ్రీనివాస్ గుప్తా బోడసింగిపేటలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో వచ్చి చూడగా షాపు షట్టర్‌ను పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ యు.మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. షాపులో ఉంచిన రూ.12వేలు నగదుతోపాటు షాపులో రూ.13వేల విలువైన కిరాణా వస్తువులు అపహరించుకుపోయినట్లు బాధితుడు పోలీసు ఫిర్యాదులో తెలిపాడు.

కంటైనర్ బడ్డీ తొలగింపు

నెల్లిమర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ప్రభుత్వ స్థలంలో స్థానికుడు ఏర్పాటు చేసుకున్న కంటైనర్ బడ్డీని రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. తహసీల్దార్ సుదర్శన రావు ఆదేశాల మేరకు ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వోలు గోవింద్, వెంకటరావు, వెంకటలక్ష్మి తదితరులు ఈ చర్యలు చేపట్టారు.

సీతమ్మవారి శతమానం కోసం రూ.లక్ష బహూకరణ

లక్కవరపుకోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రంగారాయపురంలో గల సీతారాముల ఆలయంలో సీతమ్మవారి విగ్రహానికి శతమానం నిమిత్తం ఎల్.కోట వీరాంజనేయ ఫిషరీస్ సంఘం రామారావు, ఈశ్వరరావు, రామకృష్ణ లక్ష రూపాయలు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావుకు శనివారం బహూకరించారు. విరాళాలు ఇచ్చిన దాతలకు గ్రామం తరఫున ఈశ్వరరావు అభినందించారు.

27న సైన్స్ ఎక్స్‌పోజర్

పార్వతీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ఎక్స్‌పోజర్‌లో భాగంగా జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఒడిశా రాష్ట్రం రాయగడ పరిసర ప్రాంతాల్లోని ఆరు ప్రాంతాలను ఈనెల 27న సందర్శించనున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్ పోస్టర్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. రాయగడ పరిసర ప్రాంతాల్లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ అండ్ బేవరేజ్ లిమిటెడ్, జేకే పేపర్‌మిల్స్, నాగావళి ప్లానిటోరియం అండ్ సైన్స్ మ్యూజియం, ఫిమాకేమ్ లైం స్టోన్ ఇండస్ట్రీ, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో అల్లోయ్ లిమిటెడ్ పాంపాత్ పార్క్ సందర్శన కోసం జిల్లా నుంచి 130 మంది విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణ్, సమగ్ర శిక్షణ ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ఆధునికీకరణకు చర్యలు

పాలకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఆధునికీకరణ పనులకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తోటపల్లి ఆధునికీరణ పనులకు 2019 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారని, అయితే వెంటనే వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. 25 శాతం కూడా ఈ పనులు పూర్తికాకపోవడంతో దీనిని రద్దు చేస్తున్నట్టు ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ.. సంబంధిత మంత్రి ముఖ్యమంత్రితో మాట్లాడి పనులు ప్రారంభించడానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయంపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు జాడ శ్రీధర్ ఉన్నారు.

సేవా దృక్పథంతో ముందుకు నడుద్దాం

పాలకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసి పాలకొండ ప్రజలకు సేవలు అందిద్దామని లయన్స్‌క్లబ్ ద్వితీయ ఉప జిల్లా గవర్నర్ కేవీ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని విజయదుర్గ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. 206 దేశాల్లో 50 వేల క్లబ్‌లు, వేల మంది సభ్యులతో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రజా సేవలో నిమగ్నమై ఉందన్నారు. లయన్స్ క్లబ్ పూర్వ చైర్మన్ డీఎస్‌వీ శర్మ, హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపక అధ్యక్షుడు హారికా ప్రసాద్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో-ఆర్డినేటర శాసపు జోగినాయుడు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్‌కు పరామర్శ

పాలకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. జడ్పీ చైర్మన్ కుమారుడు ప్రణీత్‌బాబు మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో విక్రాంత్ విజయనగరంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన తోపాటు రాజాం జడ్పీటీసీ బండి నరసింహులు, ఎంపీపీ ప్రతినిధి లావేటి రాజగోపా ల్, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెంనాయుడు, బూరాడ జగన్మోహన్ రావు, వంగర జడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, బంకి లక్ష్మణమూర్తి ఉన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించండి



పన్నులు వసూలు చేస్తున్న నగర పంచాయతీ కమిషనర్ జయరాం

పాలకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ టి.జయరాం కోరారు. పట్టణంలో పలు సచివాలయాల పరిధిలో ఇంటిపన్ను, కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు చెల్లించని వారి వద్దకు ఆయన శనివారం సిబ్బందితో కలిసి వెళ్లి అవగాహన కల్పించారు. ఈనెలాఖరులోగా పన్నులు చెల్లించాలని, లేకపోతే అదనపు వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పన్ను బకాయిలను సచివాలయం సిబ్బందికిగానీ, నగర పంచాయతీలో ఉన్న కలెక్షన్ కౌంటర్‌లో గానీ చెల్లించి రశీదు పొందాలన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకూడదు

నగర పంచాయతీలో తాగునీటికి ఇబ్బందులు రాకూడదని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం అన్నారు. నగర పంచాయతీలోని గారమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. వడమ దగ్గర ఉన్న మంచినీటి ట్యాంకును పరిశీలించారు. నీటి శాతంపై ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు రోజుల్లో గారమ్మకాలనీకి నీరందిస్తామని కాలనీ ప్రజలకు కమిషనర్ హామీనిచ్చారు. ఆయన వెంట నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ డి.వరప్రసాద్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఐదో తరగతిలో 80 సీట్లు ఉన్నాయని చెప్పారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లుకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పాఠశాల పనివేళల్లో నేరుగా సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9948944919, 9440348217 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జాకరమ్మ జాతరకు ఏర్పాట్లు

పార్వతీపురంటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఇలవేల్పు జాకరమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు పిన్నింటి వెంకటరమణ నివాసం వద్ద జాకరమ్మ జంగిడికి ఆ ఇంటి పెద్ద అప్పలనరసమ్మ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం జంగిడిని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాల మధ్య బైపాస్ రహదారిలో గల ప్రధాన ఆలయం వద్దకు తీసుకువస్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

ఆశ్రమ పాఠశాలల మంజూరు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేదారిపురం, బాలేసు గ్రామాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు మంజూరైనట్టు గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ ఆశ్రమ పాఠశాలల నిర్మాణానికి స్థలాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క పాఠశాలకు ఆ గ్రామాల్లో రెండు ఎకరాలు చొప్పున స్థలాన్ని సేకరిస్తున్నామన్నారు. ఇప్పటికే కేదారిపురం గ్రామంలో నిర్మాణానికి స్థలం సేకరించామని చెప్పారు. ఈ స్థల సేకరణ రిపోర్టును సబ్‌కలెక్టర్‌కు పంపించామని ఆయన తెలిపారు.

బలవంతంగా చందాలు వసూలు చేయొద్దు

ఒడిశా

రాయగడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి తొలి పండగ ఉగాది వేడుకల నిర్వాహణ కోసం బలవంతపు వసూలు తగదని పూర్వ రాజ్యసభ సభ్యుడు, బిజూ జనతాదళ్ సీనియర్ నాయకుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. ఈ మేరకు శనివారం రాయగడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 13 ఏళ్లగా పట్టణ ప్రజలందరి సహకారంతో ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా అలాగే నిర్వహిద్దామన్నారు. ఇందుకోసం బలవంతంగా చందాలు వసూలు చేయవద్దని, ఎవరైనా స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేస్తే స్వీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ మలుపు.. ప్రమాదాలకు పిలుపు



మిర్తివలస వద్ద ప్రమాదకర మలుపు

బలిజిపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్తివలస వద్ద ఉన్న రోడ్డు మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. బొబ్బిలి-బలిజిపేట ఆర్‌అండ్‌బీ రహదారిలో మిర్తివలస శివాలయం వద్ద ఉన్న మలుపు కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇదే మలుపులో ఇటీవల ఆర్టీసీ బస్సు, 104 వాహనం ఢీకొని ఇద్దరు మృతిచెందిన విషయం విదితమే. తుమరాడకు చెందిన ఒక వ్యక్తి కారుతో లారీని ఢీకొని ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఇలా తరచూ ఈ మలుపులో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మలుపులో మిర్తివలసకు చెందిన వ్యక్తి ఇల్లు నిర్మించి రోడ్డుపైనే మట్టి దిబ్బ వేశాడు. దీంతో రోడ్డుపైన వస్తున్న వాహనదారులకు ఇబ్బందికరంగా తయారైంది. ఈ మలుపులో ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సమావేశాలకు హాజరు కాకపోతే ఎలా?

- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

సీతానగరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు సమావేశాలకు గైర్హాజరైతే ఎలా అని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బలగ రవణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యుత్, ఆర్‌అండ్‌బీ, అటవీ, పీఆర్ ప్రాజెక్టు అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడు వారాలుగా ఉపాధి వేతనదారులకు బిల్లులు చెల్లించలేదని పెదభోగిలి ఎంపీటీసీ సభ్యురాలు బి.కుసుమ సభ దృష్టికి తీసుకొచ్చారు. గత 40 ఏళ్లగా మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నా ఈ ఏడాది పరీక్షా కేంద్రాన్ని తీసివేయడంపై పెదభోగిలి సర్పంచ్ తెరిజమ్మ.. మండల విద్యా శాఖాధికారిని నిలదీశారు. తొలుత వ్యవసాయ శాఖ అధికారి అవినాష్ మాట్లాడుతూ రూ.80వేలు రాయితీపై నూర్పిడి యంత్రం, 50శాతం రాయితీపై ఇతర పరికరాలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు తొలగించకుండా చర్యలు తీసుకోండి

రాజాం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్ల విస్తరణలో భాగంగా రాజాంలోని చీపురుపల్లి రోడ్డులో ఉన్న విఘ్నేశ్వరాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాలు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ధర్మకర్తలు కొత్తా రమేష్, దొంతంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్‌ను శనివారం కలిశారు. ఆలయాలను తొలగిస్తుండడడంతో జగదీష్ టీడీపీ నాయకులతో పరిశీలించారు. ఆలయాలు పూర్తిగా తొలగించకుండా వెనక భాగంలో ఉన్న స్థలంలో విగ్రహాలు ఏర్పాటుకు సహకరించాలని వారు కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి వెనకక్కు విగ్రహాలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, మరిపి జగన్మోహన్‌రావు, దూబ ధర్మారావు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, టంకాల నాగరాజు పాల్గొన్నారు

ఉపాధి పనులు కల్పించండి

వీరఘట్టం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వండువ గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ గ్రామంలో సభ నిర్వహించారు. అధికారులు, గ్రామ పెద్దలు చొరవ తీసుకుని గ్రామంలో ఉపాధి పనులు కల్పించేలా చూడాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్యాణమ్మ, వైస్ సర్పంచ్ మనోరమ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ మావుడి సబ్ స్టేషన్ (33/11 కేవీ) పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పార్వతీపురం ఏపీఈపీడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపాలరావునాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. త్రీఫేజ్ ఉదయం నాలుగు గంటల నుంచి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

ప్రభుత్వ కార్యాలయల్లో ఎర్త్ అవర్

పార్వతీపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కలెక్టర్ బంగ్లా, ఐటీడీఏ పీవో బంగ్లా తదితర ప్రభుత్వ అధికారుల నివాసాల్లో శనివారం రాత్రి ఎర్త్ అవర్ పాటించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపు మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ వినియోగాన్ని నిలిపివేశారు.

ఉపాధి ఉద్యోగులకు కౌన్సెలింగ్

పార్వతీపురం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో పనిచేస్తున్న ఏపీవోలు, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లుకు శనివారం డ్వామా పీడీ రామచంద్రరరావు ఆధ్వర్యంలో పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగల బదిలీలు పనిచేసిన ప్రదేశం సీనియారిటీ ప్రకారం నిర్వహించారు. ఉద్యోగులకు సంబంధించిన బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో వారికి కేటాయించిన ప్రాంతాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

చెత్త నుంచి విముక్తి



డంపింగ్‌యార్డులో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

బొబ్బిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం రోడ్డులో సుమారు మూడెకరాల విస్తీర్ణంలో గల డంపింగ్ యార్డులో 50 ఏళ్లుగా గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎట్టకేలకు తొలగించనున్నారు. ఈ యార్డుకు దగ్గరల్లో ఓ మిషనరీ స్కూలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, ముద్దువలస నిర్వాసితుల కాలనీ, పలు ఆలయాలు ఉన్నాయి. వెంగళరాయసాగర్ పిల్లకాలువ కూడా ఉంది. ఆ కాలువలోనికి చెత్త అంతా పేరుకుపోతుండడంతో రైతులు అనేక సార్లు దీనిపై ఫిర్యాదులు చేశారు. సుమారు 25 ఏళ్ల నుంచి ఈ చెత్తను తరలించే ప్రయత్నాలు జరిగినప్పటికీ ఏ ఒక్కటీ సఫలం కాలేదు.

14,711 మెట్రిక్ టన్నులు..

సుమారు మూడెకరాల విస్తీర్ణంలో 14,711 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయినట్లు డ్రోన్ కెమేరాతో సర్వే చేసి అంచనా వేశారు. గుంటూరుకు చెందిన తరుణి అసోసియేట్స్‌కు స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన బిడ్డింగ్ ప్రకారం బొబ్బిలి డంపింగ్ యార్డులో చెత్తను అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ తరపున సుమారు రూ.12లక్షలు ఖర్చు చేసి ఆ సంస్థకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నీరు, రోడ్డు వంటి సౌకర్యాలను సమకూర్చారు. సదరు సంస్థ డంపింగ్ యార్డులో చెత్తశుద్ధి కార్యకలాపాలను ఇటీవల చేపట్టింది. బయో మైనింగ్, బయో క్యాపింగ్‌పనులు చేపట్టారు. యంత్రాలతో శాగ్రిగేట్ చేస్తున్నారు.

ఈ స్థలాన్ని వేరే అవసరాలకు వినియోగిస్తాం

స్థానిక డంపింగ్ యార్డులో సుమారు 15వేల టన్నులకు పైగా చెత్త పెద్ద గుట్టలా పేరుకుపోయింది. దీనిని శుద్ధి చేసి తరలించే చర్యలు ప్రారంభించాం. చెత్తంతా తొలగించిన తర్వాత అత్యంత విలువైన ఆ స్థలాన్ని మున్సిపల్ అవసరాల కోసం వినియోగిస్తాం. స్థానిక ఎమ్మెల్యే, పాలకవర్గం సూచనల మేరకు అవసరమైన ప్రణాళికను రూపొందిస్తాం. రామన్నదొరవలసలో ఉన్న చెత్తశుద్ధి పార్కును జాతీయ స్థాయిలో పేరు సాధించింది. దానిపై మళ్లీ దృష్టి సారించి అభివృద్ధి పరుస్తాం.

- లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

పీ4 సర్వేపై వార్డుసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పీ4) సర్వేపై మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం బొబ్బిలిలోని 8 సచివాలయాల్లో వార్డు సభలను నిర్వహించారు. అట్టడుగున ఉన్న 20 శాతం మంది నిరుపేద వర్గాలను నిర్దేశిత సూచికల ఆధారంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు కమిషనర్ వివరించారు. పట్టణంలో మొత్తం 16 సచివాలయాలు ఉండగా శనివారం 8, ఆదివారం 8 సచివాలయాల్లో ఈ పీ4 సర్వే వార్డు సభలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. స్థానిక కంచరవీధి సచివాలయంలో ఆ వార్డు కౌన్సిలరు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన వార్డు సభ నిర్వహించారు. పక్కా ఇళ్లు, విద్యుత్, బ్యాంకు అకౌంట్, గ్యాస్ కనెక్షన్ వంటివి లేకుండా ఇంకా ఎటువంటి సంపాదన లేనివారిని గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే సర్వే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని శరత్‌బాబు అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. ఈ వార్డు సభలలో ఐదో వార్డు కౌన్సిలరు వెలగాడ హైమావతి, మున్సిపల్ మేనేజరు పీటీవీ రాఘవాచార్యులు, డీఈఈ పి.కిరణ్‌కుమార్, టీపీఆర్‌వో ఎం.జగన్మోహనరావు, సచివాలయాల సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పాలకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బరువు తక్కువ ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సిమ్మాలమ్మ అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణబీ పడాయిబీ శిక్షణా కార్యక్రమాన్ని మూడోరోజు శనివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ చిన్నారుల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ చూపా లన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా పత్రాలు అందించారు. సూపర్‌వైజర్ దశారత్నం, రాజేశ్వరి, జ్ఞానమ్మ, త్రివేణి, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

- కురుపాం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పోషణ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా శనివారం కురుపాంలో ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవాని, జానికి, గౌరి, శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు చెత్త సేకరణపై శిక్షణ



సీతానగరం: మాట్లాడుతున్న డీపీవో కొండలరావు

సీతంపేట రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరించడం, వేరు చేయడం, వర్మీ కంపోస్టుగా మార్చడంపై స్థానిక ఎస్‌డబ్ల్యుపీసీలో శనివారం గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో జె.రాజేంద్రప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్లు ఈ శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవో కె.గీతాంజలి, ఈవోపీఆర్డీ కె.సత్యం, డీపీఆర్సీ రిసోర్స్ పర్సన్ కన్నబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

- సీతానగరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పెదభోగిలి పంచాయతీ ఎస్‌డబ్ల్యూపీసీలో గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కొండలరావు పాల్గొని మాట్లాడారు. నాలుగు మండలాల గ్రీన్ అంబాసీడర్లు, పంచాయతీ కార్యద ర్శులు ఈ శిక్షణలో పాల్గొని, వినియోగించుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలి

సాలూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జీడి ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించి గిరిజన జీడి రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం కురుకూటి, వెలగవలసలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ యంత్రాలను ప్రారంభించకపోవడం వల్ల తుప్పు పట్టి పాడవుతున్నాయన్నారు. వీటిని ప్రారంభిస్తే గిరిజనులకు ఉపాధి సైతం లభిస్తుందన్నారు. జీడి కిలో రూ.200 మద్దతు ధర ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అయోధ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి



ప్రహరీ నిర్మాణం పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ రవి

కురుపాం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ప్రహరీలను నాణ్యతతో చేపట్టాలని పాలకొండ డివిజన్ పంచాయతీరాజ్ ఈఈ జి.రవి అన్నారు. కురుపాంలో నిర్మిస్తున్న ప్రహరీని ఆయన శనివారం పరిశీలించారు. మండలంలో 40 ప్రహరీలు మంజూరు కాగా, 10 పూర్తయ్యాయని తెలిపారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా చేపట్టాలని జేఈ పి.నాగేశ్వరరావుకు ఆదేశించారు.

న్యూస్ బాక్స్

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

బొబ్బిలి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని బొబ్బిలి సీఎస్‌డీటీ సాయికృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈకేవైసీ చేసుకోవాలన్నారు. లేకుంటే సంబంధిత సభ్యుడి పేరు కార్డులో ఉండదన్నారు. బొబ్బిలి మండలంలో ఇంకా 6,562 రేషన్ కార్డులు ఈకేవైసీ చేయాల్సి ఉందని తెలిపారు. ఈ నెలాఖరులోగా చేయించుకోకపోతే ఇబ్బందులకు గురవుతారని తెలియజేశారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

బొబ్బిలి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. జగన్నాథపురంలో మూడు చోట్ల ఏర్పాటుచేస్తున్న చెత్త కుండీ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. సర్పంచ్ ప్రతినిధి బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ప్రజా రెవెన్యూ కోర్టు

బొబ్బిలి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రజా రెవెన్యూ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీను ప్రజల నుంచి రీసర్వే, భూముల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడే పరిష్కరించారు. హెచ్‌డీటీ టీకేవీ సుబ్బారావు, ఆర్ఐ కె.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీల స్వయం ఉపాధి యూనిట్లకు గడువు పెంపు

పార్వతీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ వర్గాల స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు దరఖాస్తు గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్టు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 22వ తేదీతో గడువు ముగిసిందని, అయితే ప్రభుత్వం మరో మూడు రోజులు గడువును పెంచిందని చెప్పారు. ఈ అవకాశాన్ని బీసీ అభ్యర్థులు, ఈబీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట సర్కిల్ నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 26వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎల్విన్‌పేట సీఐ హరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న యువత తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన పెంచుకోండి

సీతంపేట రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై గిరిజన రైతులు అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హరికుమార్ సూచించారు. శనివారం గజిలి గ్రామంలో ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన.. జీడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. హెచ్‌వో జయశ్రీ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుసిమిగూడ గ్రామ సమీపంలో శనివారం స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, 3 వేల లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. ఊటలను భద్రపరిచే ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు.

- వీరఘట్టం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర గ్రామంలో 1,200 లీటర్ల బెల్లం ఊటలను గుర్తించి, ధ్వంసం చేశామని ఎస్ఐ కళానిధి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించి, బెల్లంఊటలను ధ్వంసం చేశామని చెప్పారు.